ఆకట్టుకున్న ఆర్ట్ ఎక్స్ పో



ఆర్ట్ ఎక్స్ పోను ప్రారంభిస్తున్న స్కూల్ డైరెక్టర్ భాగ్యలక్ష్మి

లాలాపేట: శాంతినగర్‌లోని తక్షశిలా పబ్లిక్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన ఆర్ట్స్ ఎక్స్ పో ఆకట్టుకుంది. విద్యార్థులు వివిధ రకాలైన చిత్రాలను ఈ ఎక్స్ పోలో ప్రదర్శించారు. పాఠశాల డైరెక్టర్ భాగ్యలక్ష్మీ మాట్లాడుతూ మనుషులు మాట్లాడలేని ఎన్నో భావాలను చిత్ర కళల ద్వారా చెప్పగలుతారని అన్నారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓయూను పరిశ్రమలతో అనుసంధానం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తూ పరిశ్రమలతో అనుసంధానం చేయాలని జేఏసీ నాయకులు కోరారు. శనివారం వీసీ ప్రొ.కుమార్‌ను కలసి పుష్పగుచ్ఛాన్ని అందచేసి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు, టీపీసీసీ రాష్ట్ర నాయకులు దరువు ఎల్లన్న, దుర్గం భాస్కర్, ఓయూ జేఏసీ ఛైర్మన్ కొత్తపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, బెల్టుల పంపిణీ



విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు అంకిత బావంతో పనిచేస్తూ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అదిరోహించేందుకు కృషి చేస్తున్నారని నిరీక్షణ ఫౌండేషన్ అధినేత్రి దుగ్గిరాల మాధురి అన్నారు. శనివారం సికింద్రాబాద్ నల్లగుట్టలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 300 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, టైలు, బెల్టులు, నోటు పుస్తకాలు ఉచితంగా అందించారు. దుగ్గిరాల మోక్ష పాఠశాలకు రెండు పియానోలు బహూకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల కోసం ప్రధానోపాధ్యాయులు శౌరి ప్రత్యేక చొరవ తీసుకుని దాతల సహకారంతో అనేక మౌళిక సదుపాయాలు కల్పించడంతో పాటు అత్యుత్త బోధన అందించేందుకు తన వంతు కృషి చేస్తున్నారని అభినందించారు.

ఉచిత వైద్య శిబిరం అభినందనీయం



వైద్య శిబిరంలో రోగులకు మందులు అందిస్తున్న కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్

రాంగోపాల్‌పేట్: పేద ప్రజల ఆరోగ్యం పట్ల ఎన్‌జీవోలు చొరవ తీసుకుని వారికి వైద్యాన్ని అందించడం అభినందనీయమని మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్ అన్నారు. శనివారం సికింద్రాబాద్ కళాసీగూడలోని జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్‌లో మక్తాల ఫౌండేషన్, జనహిత సేవా ట్రస్టు, శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిమ్స్ ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్, జనరల్ ఫిజీషియన్, గైనకాలజీ, పిడియాట్రిక్, శ్రీ భాస్కరా ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి, డెంటల్, సంబంధించిన వైద్యులు హాజరై రోగులకు వైద్యాన్ని అందించడంతో పాటు ఉచితంగా మందులు అందించారు. డాక్టర్ ఎం శ్రీనివాస్ ఫిజియో థెరఫీ సేవలు అందించి సరియైన వ్యాయామం, నొప్పుల నివారణకు సూచనలు అందించారు.

ఇందిరా మహిళా శక్తి పథకంతో మహిళా సాధికారత



కుట్టు మిషన్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి

లాలాపేట: తెలంగాణ ప్రభుత్వం మహాళాభివృద్ధికి ప్రారంభించిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని మాణికేశ్వర్‌నగర్‌లోని రేణుకా మహిళా పొదుపు సంఘానికి ప్రభుత్వం రూ 7 లక్షల రుణాన్ని అందజేసింది. ఈ నిధులతో మాణికేశ్వర్‌నగర్‌లో రేణుకా కుట్టుమిషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనిని శనివారం డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ మహిళా సాదికారతకు ఇందిరా మహిళా శక్తి పథకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. కుట్టు మిషన్ కేంద్రంతో మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. జీహెచ్‌ఎంసీ డీపీఓ శ్రీనాథ్, సీఓ శ్రీవాణి, మాణికేశ్వర్‌నగర్ ఎస్ఎల్ఎఫ్ ప్రెసిడెంట్ జయశీల, ఓబి మెంబర్ పి.నవనీత, సెక్రటరీ వర్షిక, రిసోర్స్ పర్సన్ కస్తూరి తదితరులున్నారు.

విద్యార్థినికి చేయూత

వెంకటేశ్వరకాలనీ: ఎంబీబీఎస్ విద్యార్థిని చదువుకు ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి బాసటగా నిలిచారు. ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఖైరతాబాద్ డివిజన్ మహాభారత్‌నగర్‌కు చెందిన పత్లావత్ కృష్ణ కుమార్తె లయశ్రీ ఎంబీబీఎస్ చదువుతుంది. అయితే వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో ఫీజు కట్టలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో వారి ఆర్థిక పరిస్థితి గురించి తెలుసుకున్న ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి స్పందించి ఎంజీఆర్ ఆసరా ఫౌండేషన్ ద్వారా ఆమె ఎంబీబీఎస్‌కు అయ్యే ఫీజును అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు లయశ్రీ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలి



సదస్సుకు హాజరైన టీఎన్ఏఐ ప్రతినిధులు..

సనత్‌నగర్: తెలంగాణలో నర్సింగ్ సేవలు మరింత విస్తృతం చేసేందుకు ప్రత్యేక నర్సింగ్ విశ్వవిద్యాలయం ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందని ది ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (టీఎన్ఏఐ) దక్షిణ ప్రాంత ఉపాధ్యక్షురాలు డాక్టర్ జెయినీ కెంప్ అన్నారు. తెలంగాణలో ప్రభుత్వ, ప్రైవేటు నర్సింగ్ కళాశాలలు 136 ఉండగా వీటి సంఖ్య మరింతగా పెరగడం ద్వారా మరింతగా మెరుగైన నర్సింగ్ సేవలు అందుతాయన్నారు. ది ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఐదవ ద్వైవార్షిక సదస్సు శనివారం సనత్‌నగర్‌లోని సెయింట్ థెరిస్సా స్కూల్ ఆవరణలోని జేఎంజే స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో జరిగింది. టీఎన్ఏఐ తెలంగాణ అధ్యక్షులు డాక్టర్ రాజేశ్వరి అధ్యక్షతన 'లీడర్‌షిప్ ఇన్ నర్సింగ్: ఇన్‌స్పైరింగ్ విజన్, డ్రైవింగ్ ఛేంజ్ అనే అంశంపై జరిగిన సదస్సుకు రాష్ట్ర నలమూలల నుంచి 300 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జెయినీ కెంప్ మాట్లాడుతూ ప్రభుత్వ,ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న సుశిక్షితులైన నర్సులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని, వారి సమస్యల పరిష్కారానికి టీఎన్ఏఐ బాధ్యతగా వ్యవహరిస్తోందన్నారు. ఈ సందర్భంగా జరిగిన సైంటిఫిక్ పేపర్, పోస్టర్ ప్రజంటేషన్‌తో పాటు ప్యానెల్ డిష్కషన్‌లో టీఎన్ఏఐ ప్రతినిదులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో టీఎన్ఏఐ డిప్యూటీ సెక్రటరీ జనరల్ సంఘమిత్ర సావంత్, టీజీఎన్ఎంసీ రిజిస్ట్రార్ విద్యావతి, ఇన్‌చార్జి డీడీ నర్సింగ్, విద్యుల్లత, టీఎన్ఏఐ కార్యదర్శి స్వరాజ్యవాణి తదితరులు పాల్గొన్నారు.

ఆల్ సోల్స్ డేకు ఏర్పాట్లు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: నవంబర్ 2వ తేదీన నిర్వహించే ఆల్ సోల్స్ డే (పవిత్ర ఆత్మలదినం)కు అన్ని ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం బన్సీలాల్‌పేటలోని బోయిగూడలో క్యాథలిక్ గ్రేవ్ యార్డులో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆల్ సోల్స్ డే సందర్భంగా గ్రేవ్‌యార్డుకు వేలాది మంది వస్తారని, వారు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా వసతులు, సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. గ్రేవ్‌యార్డుకు పెయింటింగ్ వేయడం, శుభ్రపర్చడం, అవసరమైన లైటింగ్ ఏర్పాటు, చెత్త, వ్యర్థాలను తొలగించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ హేమలత, ఈఈ సుదర్శన్, హార్టికల్చర్ అధికారి గణేష్, ఎలక్ట్రికల్ ఏడీఈ మోహన్, స్ట్రీట్‌లైట్స్ ఏఈ భరత్, శానిటేషన్ డీఈ ధర్మారెడ్డి, గ్రేవ్‌యార్డు నిర్వాహకులు జయరాజ్, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు వెంకటేషన్‌రాజు, ఏసూరి మహేష్, శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మీపతి, రమణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్ పర్యటన

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని కేబీఆర్ పార్కు చౌరస్తాతో పాటు జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-45లో ట్రాఫిక్‌ను పరిశీలించేందుకు నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్ పర్యటించారు. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్‌తో కలిసి కేబీఆర్ పార్కు చౌరస్తాలో ఫ్రీ లెఫ్ట్ ప్రాంతాన్ని పరిశీలించి ఇక్కడ ట్రాఫిక్ స్తంభించకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఫుట్‌పాత్‌లను పాదచారులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చేయాల్సిన చర్యలపై సమీక్షించారు. ఫ్రీ లెఫ్ట్‌లో కేబీఆర్ పార్కు వాకర్లు కార్లు పార్కింగ్ చేయకుండా నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.

నీరు లేకుండా జీవితం లేదు



సమావేశంలో పాల్గొన్న ప్లంబింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

అమీర్‌పేట: నీరు లేకుండా జీవితం లేదని ఐపీఏ జాతీయ అధ్యక్షులు గుర్మిత్‌సింగ్ అన్నారు. హైటిక్స్‌లో నవంబర్ 21వ తేదీ నుంచి 23 వరకు జరుగనున్న 30వ ఇండియన్ ప్లంబింగ్ కాన్ఫరెన్స్ సన్నాహక కార్యక్రమం అమీర్‌పేట గ్రీన్ పార్క్ మ్యారీగోల్డ్ హోటల్‌లో నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీరు ఒక వనరు కాదని,అది మన సంఘాలు, ఆర్థిక వ్యవస్థలకు జీవనాధారమని తెలిపారు. 2030 నాటికి దేశం మొత్తం నీటి డిమాండ్‌లో నగం కంటే తక్కువగా ఉంటుందని చెప్పారు. సదస్సులో పలు అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్లంబింగ్ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు తెలంగాణ ఆర్ అండ్ బీ ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

ఓయూలో రామానుజన్ జయంతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీలోని స్టాటిస్టిక్స్ విభాగంలో రామానుజన్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. శనివారం సైన్స్ కాలేజీ ప్రిన్సిపల్ కార్యాలయం ఆడిటోరియంలో జరిగిన జయంతి ఉత్సవాలకు ప్రిన్సిపల్ ప్రొ.వీరయ్య అధ్యక్షత వహించగా వీసీ ప్రొ.కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (టీజీసీవోఎస్టీ) స్పాన్సర్‌తో డేటా సైన్స్‌లో ఇటివల పోకడలు అనే అంశం పై ఒక రోజు జాతీయ సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో సైన్స్ డీన్ ప్రొ.కరుణసాగర్, స్టాటిస్టిక్స్ హెడ్ ప్రొ.జయశ్రీ, బీవోఎస్ ప్రొ.భద్రాచార్యులు, ఎస్వీ వర్సిటీ ప్రొ.విష్ణువర్ధన్ రావు తదితరులు పాల్గొన్నారు.

లోక్ మంథన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 28న ఏఎంఎస్ బీఈడీ కాలేజీలో జరిగే లోక్ మంథన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బార్ కౌన్సిల్ ఛైర్మన్ నర్సింహారెడ్డి కోరారు. శనివారం ఏఎంఎస్ ఆడిటోరియంలో ప్రీ లోక్ మంథన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ భారత దేశంలోని భిన్న సంస్కృతులు, ఆచార వ్యవహారాలు, జీవన విధానం, కళలను ఒకే వేదికపై ప్రదర్శించబోతున్న లోక్ మంథన్ కార్యక్రమానికి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవతం చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రొ.సుధాకర్, ప్రొ.రామకృష్ణ, జేపీ నిరంజన్, కాలేజీ ప్రిన్సిపల్ నీరజ తదితరులు పాల్గొన్నారు.

లైన్ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయాలి



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర బీసీ సంఘం సెక్రటరీ, విద్యుత్ విభాగం ఉద్యోగులు

రసూల్‌పురా: విద్యుత్ విభాగం లాల్‌బజార్ సెక్షన్‌లో లైన్‌మెన్‌పై ఇనుపరాడ్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపరచిన లైన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌ను సస్పెండ్ చేయాలని రాష్ట్ర బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి వెంకన్న గౌడ్ హెచ్చరించారు. శనివారం మడ్‌ఫోర్ట్‌లోని డివిజన్ ఇంజనీరింగ్ అధికారి సుబ్బారెడ్డి ఛాంబర్‌లో లైన్‌మెన్ రాముతో పాటు బీసీ, విద్యుత్ సంఘాల నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. లైన్‌మెన్ రాముపై దాడి జరిగి వారం రోజులు కావొస్తున్న లైన్ ఇన్స్‌పెక్టర్ పై ఎందుకు చర్యలు తీసుకోలే దని వెంకన్న గౌడ్‌డీఈని ప్రశ్నించారు. వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. డీఈ సుబ్బారెడ్డి, ఏఈ ప్రసాద్‌కు వ్యతిరేకంగా ఉద్యోగులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డీఈ సుబ్బారెడ్డి మాట్లాడుతూ దాడి చేసిన నివేదిక తనకు ఇప్పుడే అందిందని ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తానని శాఖపరమైన చర్యలు తీసు కుంటామని హామీచ్చారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై సంఘటిత పోరాటం



రైల్వే పెన్షనర్ల అనుబంధశాఖల సమావేశం

చిలకలగూడ : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ఉద్యోగ వ్యతిరేక విధానాలపై పోరాటం చేసి న్యాయమైన డిమాండ్లు, హక్కుల సాధనకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయనున్నట్లు రైల్వే పెన్షనర్స్ సంఘ్ జాతీయ అధ్యక్షుడు ఆర్‌వీఎస్ రాఘవరావు తెలిపారు. రైల్వే పెన్షనర్స్ సంఘ అనుబంధశాఖలు, వర్క్‌షాపు, ఇంజనీరింగ్ విభాగాల సర్వసభ్య సమావేశంలో చిలకలగూడ రైల్వే సంఘ్ కార్యాలయంలో శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హజరైన ఆయన మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వం 8వ వేతన సంఘ ప్రకటన ఇవ్వలేదని, 18 నెలల డీఆర్ బకాయిలు చెల్లించలేదని, సంయుక్త పార్లమెంటరీ కమిటీ సిఫార్స్ చేసిన సీనియర్ పెన్షనర్లకు ఫించను పెంపుదల, సీనియర్ సిటిజన్స్‌కు రైల్వే చార్జీలలో రాయితీలు అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయమైన హక్కులు సాధనకు సంఘటిత పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సంఘంలో జీవితకాల సభ్యులను చేర్పించాలని, సంఘ పత్రికలో చందాదారులుగా చేరాలని జాతీయ ప్రధాన కార్యదర్శి రామకృష్ణమాచార్యులు కోరారు. డిసెంబర్‌నెలలో జరిగే రైల్వే కార్మిక సంఘ్ ఎన్నికల్లో జాతీయ కార్యదర్శి మర్రి రాఘవయ్య అభ్యర్థిత్వాన్ని బలపరచి, అనుబంధ సంఘాలను గెలిపించాలని వర్క్‌షాప్‌శాఖ అధ్యక్షుడు బాబునాయక్ కోరారు. సంఘ ప్రతినిధులు బీకే సింగ్, విద్యాసాగర్, నారాయణ, జైపాల్, రాజన్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

చైన్ స్నాచర్ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటరమణ


అమీర్‌పేట: చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డ యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏసీపీ ఎ.వెంకటరమణ వివరాలను వెల్లడించారు. సనత్‌నగర్ జెక్ కాలనీ లక్ష్మీ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నెం.206లో ఉండే అలమూరి కృష్ణకుమారి(64) వాకింగ్ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన అగంతకుడు ఆమె మెడలో ఉన్న 3 తులాల బంగారు గొలుసును లాక్కుని పారిపోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి కాలనీలోని సీసీకెమెరాల ఫుటేజీల ఆధారంగా నింధితుడిని గుర్తించారు. బోరబండ హబీబ్‌ఫాతిమానగర్‌కు చెందిన గుడిమెట్ల గోపీనాథ్ (25)గా గుర్తించి అరెస్టు చేశారు.

రైలులో నుంచి జారి పడి వృద్ధుడి మృతి



అడ్డగుట్ట: ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారి పడిన ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం... ఈ నెల 25న సాయంత్రం 5 గంటల సమయంలో గుండ్ల పోచంపల్లి - బొల్లారం రైల్వే స్టేషన్ల మార్గం మధ్యలో ప్రమాదవశాత్తు రైలులో నుంచి సుమారు 60-65 ఏళ్ల మధ్య వయస్సు గల గుర్తు తెలియని వృద్ధుడు కింద పడిపోయాడు. ఈ క్రమంలో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



అడ్డగుట్ట: అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. జీఆర్పీ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం ... సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లోని ప్లాట్ ఫామ్ నెం. 3లో శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో సుమారు 60 సంవత్సరాల వయస్సు గల ఓ గుర్తు తెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. గమనించిన పోలీసులు సదరు వ్యక్తి వద్దకు వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. వెంటనే మృతుడ్ని గాంధీ మార్చురీకి తరలించారు. బ్లూకలర్ ఫుల్ హ్యాండ్స్ షర్ట్, లైట్ గ్రీన్ కలర్ నైట్ ప్యాంట్ మృతుడు ధరించినట్లు తెలిపారు.

సందడిగా స్పోర్ట్స్ డే

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ వార్షిక స్పోర్ట్స్ డే సందడిగా నిర్వహించారు. శనివారం జరిగిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా వీసీ ప్రొ.కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందచేసి మాట్లాడారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట్: ఫీడర్ల మరమ్మతులు కారణంగా ఈనెల 27న పాటిగడ్డ, మోండా మార్కెట్, జేమ్స్ స్ట్రీట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సీబీడీ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బుద్ధాభవన్ ఫీడర్ పరిధిలోని బుద్ధాభవన్ ప్రాంతాల్లో, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు గురుద్వారా ఫీడర్ పరిధిలోని గాంధీనగర్ పీఎస్, ఓల్డ్ బోయిగూడ ప్రభుత్వ పాఠశాల, రైల్ కళారంగ్ ప్రాంతాల్లో , మధ్యాహ్నం 1 గంట నుంచి 1.30 గంటల వరకు అప్సానీ ఫీడర్ పరిధిఆలోని అప్సానీ హోటల్, హార్డీ కాంప్లెక్స్, పార్సీ కాంపౌండ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో రూపాయల్లో..) టమాటా.35, నల్లవంకాయ 40, పొడుగు వంకాయ 35, బెండకాయ 65, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 60, క్యాప్సికమ్ 75, పచ్చకాకర 45, పందిరి బీర 55, క్యాబేజీ 23, క్యారెట్ 43, దొండ 35, గుండుబీన్స్ 105, గింజ చిక్కుడు 85, గోకరకాయ 55, కీర 25, దోసకాయ 35, బీట్‌రూట్ 32, ఉల్లిగడ్డ 45, ఆలుగడ్డ 37, చామగడ్డ 37, మొరంగడ్డ 23, కందగడ్డ 55, సొరకాయ 17, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

దక్షిణాది రాష్ట్రాలపై కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్యం

ఉస్మానియా యూనివర్సిటీ: దేశాన్ని 50 ఏళ్లకు పైగా పాలించిన కాంగ్రెస్ పార్టీ దక్షిణాదికి ఏం చేసిందని సౌతిండియా పొలిటికల్ జేఏసీ ఛైర్మన్ ప్రొ.గాలి వినోద్‌కుమార్ సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పాలన పై అవగాహన లేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు కూడా దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి పట్ల నిర్లక్ష్యంగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా దక్షిణాది అభివృద్ధి పై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ హైదరాబాద్‌ను దేశ రెండో రాజధానిగా, కర్ణాటకలో సౌతిండియా పబ్లిక్ కమీషన్, కేరళలో దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి మండలి, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు ప్రత్యేక ప్యాకేజీ, పాండిచ్చేరిని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలి



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ పత్రాలు అందిస్తున్న దృశ్యం

చిలకలగూడ : సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో చేపట్టిన అభివృద్ధి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ నూతన ఈఈగా నియమితులైన పేర్రాజు నేతృత్వంలో పలువురు ఇంజనీరింగ్ అధికారులు సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యేను కలిసి పలు అంశాలపై చర్చించారు. దీపావళి, ఆల్‌సోల్స్‌డే సందర్భంగా హిందు, క్రిస్టియన్ శ్మశానవాటికల్లో తగిన సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. లాలాపేట, అడ్డగుట్ట మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్స్, వార్డు కార్యాలయం, రహదారుల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. అనంతరం వైద్యసహాయం నిమిత్తం సీఎంఆర్ఎఫ్ పత్రాలను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో ఈఈ పేర్రాజు, డీఈఈ స్వర్ణలత, ఇంజనీరింగ్ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379